నేడు ప్రముఖ సప్త కళాకారులకు సత్కారం

చిక్కడపల్లి: జాతీయ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత కళాకారులతో పాటు నాట్య గురువులకు సప్త కళాకారుల పేరిట పురస్కారాలు, ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం 4.30 గంటలకు త్యాగరాయ గానసభలో నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షుడు చెన్నారావు తెలిపారు. ఆదివారం త్యాగరాయ గానసభలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి జన్మదినం సందర్భంగా ప్రముఖులు రాఘవచారి, హరిప్రియ, డీవీ మోహనకృష్ణ, ద్వారం సత్యనారాయణ, దూళిపాళ్ల శ్రీరామమూర్తి, జానకిరాములు, అలేఖ్యలను పురస్కారాలకు ఎంపిక చేశామన్నారు.

ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

కాచిగూడ: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల రూ.4500 కోట్ల ఫీజు బకాయిలను చెల్లించి ఆత్మహత్యలను నివారించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆత్మహత్యల నిరోధానికి నిపుణుల కమిటీని వేయాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని ఒక ప్రకటనలో కోరారు. ఫీజు బకాయిలు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తుండటంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల కోర్సులు పూర్తి అయినప్పటికి సర్టిఫికెట్లను ఇవ్వడం లేదన్నారు.

చిత్రాలనగర్ బస్తీ అధ్యక్షుడిగా బెజగం యాదగిరి

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ చిత్రాలనగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడిగా బెజగం యాదగిరి ఎన్నికయ్యారు. చిత్రాలనగర్‌లో బస్తీ కమిటీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బస్తీవాసులు బెజగం యాదగిరి, యడపల్లి లక్ష్మి అధ్యక్ష స్థానానికి పోటీ చేశారు. మొత్తం 221 ఓట్లు పోల్ అయ్యాయి. అందులో యాదగిరికి 163 ఓట్లు రావడంతో అధ్యక్షుడిగా బస్తీ ఎన్నికల అధికారులు ప్రకటించారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి అధ్యక్షుడిగా గెలిపించిన బస్తీవాసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పండ్ల పంపిణీ

ముషీరాబాద్: బీఆర్ఎస్ నగర నాయకుడు రవీందర్ కోక సహకారంతో ఆదివారం ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో విద్యార్థినులకు పండ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. 17 సంవత్సరాలుగా రవీందర్ కోక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు గడ్డం ప్రవీణ్, బి. ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజేష్, చంద్రకాంత్, నందు, వినయ్, మహ్మద్ ఇస్మాయిల్, మోజేస్, మహ్మద్ గౌడ్ పాల్గొన్నారు.

క్రీడలపై దృష్టి సారించాలి

ముషీరాబాద్: క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ప్రతి ఒక్కరూ క్రీడలపై దృష్టి సారించాలని థైక్వాండో తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్(టీటీఏ) కోశాధికారి సీహెచ్ మారుతీ వరప్రసాద్ అన్నారు. థైక్వాండో చాంపియన్‌షిప్-2025 పోటీల్లో 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు మీర్ వహాజ్, అలీఖాన్, మహేశ్వర్, మల్లికా, కృష్ణ, నర్సింహ, విజయ్‌కుమార్, సురేష్, ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా భావం అలవర్చుకోవాలి

ముషీరాబాద్: స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు సేవా భావంతో పనిచేస్తూ పేదలకు అండగా ఉండాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని రాంనగర్ ప్రేయర్ పవర్ చర్చ్‌లో బీఆర్ఎస్ నగర కార్యదర్శి ఆర్ మోజేస్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో పేదలకు అండగా నిలవాలన్నారు. పాస్టర్ శ్యామ్ అబ్రహం సామాజిక కార్యక్రమాలలో ముందుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా మోజేస్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, శ్యామ్ అబ్రహంను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చర్చ్ పాస్టర్ బ్రహ్మం, బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, కృపావరం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి యోగా దోహదం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మానసిక ఉల్లాసానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం సుందరయ్యపార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో, నిర్వాణ ఫౌండేషన్ సహకారంతో ఐదు రోజుల పాటు జరిగిన ఉచిత యోగా, మెడిటేషన్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మానవ శరీరం నిరంతరం కఠిన సవాళ్లను ఎదుర్కొంటుందని అన్నారు. వాటన్నింటిని అధిగమించాలంటే నిరంతరం యోగా సాధన చేయాలన్నారు. మానసిక ప్రశాంతతో పాటు శరీర పటుత్వం పెరుగుతుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఠా జైసింహ, పీవీ నిరంజన్‌రెడ్డి, ఎస్.మనోహర్‌రెడ్డి, వి.నాగభూషణం, ఎ.కిషన్‌రావు, ఎస్.రమేష్‌రెడ్డి, టి.స్కైలాబ్‌బాబు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు త్వరలో విముక్తి.!

- రూ.2కోట్లతో స్టామ్‌వాటర్ పైప్‌లైన్ పనులు ప్రారంభం
- నెల రోజుల నుంచి కొనసాగుతున్న పనులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కొద్ది పాటి వర్షం కురిసిందంటే సుందరయ్య విజ్ఞాన కేంద్రం ముందు ప్రాంతమంతా మోకాలిలోతు వరకు పైగా వరద నీరు చేరేది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. స్థానికులు ఈ సమస్యతో మూడు దశాబ్దాలుగా ప్రతి వర్షాకాలం సతమతమవుతున్నారు. ముంపునకు గురవుతున్న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం పరిసర ప్రాంతానికి త్వరలో విముక్తి లభించనుంది. జనరల్ బడ్జెట్ కింద ఎస్ఎన్‌డీపీ వారు ఇటీవల రూ.2కోట్ల నిధులను స్టామ్ వాటర్ (వరదనీరు) పైప్‌లైన్ వేయడానికి మంజూరు చేశారు.

◆ ఇప్పుడు ఎస్ఎన్‌డీపీ కింద రూ.2కోట్ల నిధులతో 1800ఎంఎం డయామీటర్ పైప్‌లైన్‌లు 40, 1600 ఎంఎం డయామీటర్ పైప్‌లైన్‌లు 30 మొత్తం 70 పైప్‌లైన్‌లను సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి భగత్‌సింగ్‌నగర్ మీదుగా నారాయణగూడ బ్రిడ్జి వద్ద ఉన్న మూసీ నాలా వరకు 350మీటర్ల వరకు పైప్‌లైన్లను వేయనున్నారు. ఈ పనులను నెల రోజుల క్రితమే ప్రారంభించారు. అయితే ఈ పనులను వర్షాకాలంలోపే పూర్తి చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. అయితే ఇటీవల ట్రాఫిక్ పోలీసుల అనుమతి లేకపోవడంతో సుమారు 10రోజుల పాటు అభివృద్ధి పనులకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసుల అనుమతి లభించడంతో పైప్‌లైన్ల పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.



సుందరయ్యపార్కు వద్ద వేస్తున్న స్టామ్‌వాటర్ పైప్‌లైన్‌లు

హామీలను నెరవేరుస్తున్నా..



తాను ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నానని అందులో భాగంగానే ముషీరాబాద్ నియోజకవర్గంలో అనేక ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. వీఎస్‌టీ, ఆర్టీసీ క్రాస్ రోడ్, పద్మాకాలనీ, సుందరయ్యవిజ్ఞానకేంద్రంతో పాటు నియోజకవర్గంలో ముంపు ప్రాంతాలు రక్షించేందుకు చర్యలు తీసుకుంటా.

– ఎమ్మెల్యే ముఠాగోపాల్

త్వరితగతిన పనులు పూర్తిచేస్తాం

ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు త్వరితగతిన పనులు పూర్తిచేస్తాం. మూడు నెలల్లో అనగా వర్షాకాలంలోపే పైప్‌లైన్ పనులు పూర్తి చేస్తాం. నెల రోజుల క్రితమే పనులు ప్రారంభమయ్యాయి. అందరి సహకారంతో పనులను పూర్తి చేస్తున్నాం.

– ఎస్ఎన్‌డీపీ డీఈ ధీరజ్

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



రాంనగర్ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా. ప్రతిరోజు డివిజన్‌లోని పలు ప్రాంతాలలో పర్యటించి డ్రైనేజీ మరమ్మతులు చేపడుతున్నాం. ముఖ్యంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ముంపునకు గురికాకుండా ఉండేందుకు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో మాట్లాడి జనరల్ బడ్జెట్ కింద నిధులు కేటాయించేందుకు కృషి చేశాను. ఎస్ఎన్‌డీపీ వారు రూ.2కోట్ల నిధులతో పనులు ప్రారంభించారు. డివిజన్‌లో మరిన్ని ముంపు ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటా.

– కె.రవిచారి, రాంనగర్ కార్పొరేటర్



భగత్‌సింగ్‌నగర్ బస్టాండ్ సమీపంలో కొనసాగుతున్న పైప్‌లైన్ పనులు



నారాయణగూడ బ్రిడ్జ్ వద్ద కొనసాగుతున్న నాలా పైప్‌లైన్ పనులు

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... యాకత్‌పుర – ఉప్పుగూడ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (55) పట్టాలపై కూర్చుని బెంగళూర్ నుంచి కాచిగూడకు వస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంపై లోకో పైలెట్ ఆదివారం రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (45) విద్యానగర్ – కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం నం.1పైన గుర్తుతెలియని వ్యక్తి (55) మృతదేహం లభించినట్లు కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపారు. మృతుడు సహజ మరణం పొందినట్లు ఉందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

- శ్రీ వీరభద్ర సేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం
- 27న కురవి వీరభద్రస్వామి ఆలయంలో మహా అన్నదానం

కాచిగూడ: అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అలాంటిది పది మందికి పంచి పెట్టడమే మహాదానమని శ్రీవీరభద్రస్వామి సేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, ప్రధానకార్యదర్శి కాసుల వినోద్ అన్నారు. ఆదివారం కాచిగూడలోని సేవా సమితి కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 27వ తేదీన కురవి వీరభద్రస్వామి ఆలయంలో భక్తులకు మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకకు ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రనాయక్, ఆలయ ఈఓ సత్యనారాయణ, ఆలయ మాజీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, పోలీసు, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్, ఎంపీడీఓల సహకారం ఉందన్నారు. ఈ సమావేశంలో కాసుల మల్లికార్జున్, కాసుల రమణ, చంద్రుడు, సతీష్‌కుమార్, చిత్రంజన్‌రావు, నర్ర దేవేందర్, సింగంశెట్టి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న షాబాద్ వెంకటేశం, కాసుల వినోద్

ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి



ఓంకార్ భవన్‌లో జరిగిన న్యూడెమోక్రసీ సమావేశంలో మాట్లాడుతున్న యుగని రాజు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ నాయకుడు యుగని రాజు డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి ఓంకార్ భవన్‌లో జరిగిన న్యూడెమోక్రసీ సమావేశంలో యుగని రాజు మాట్లాడుతూ.. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారంలోకి రావడానికి ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా విస్మరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి తప్పించుకునే పద్ధతిలో వ్యవహరిస్తోందని అన్నారు. ఆంధ్రాలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీల అమలులో మీనమేశాలు లెక్కిస్తోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సేవలో తరిస్తోందని ఆరోపించారు. న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర నాయకులు ఆరెల్లి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకుడు విశ్వనాథ్, ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షుడు వరదయ్య, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు సరళ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు కోడి సోమన్న, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నాట్య ప్రదర్శన

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభలోని కళా సంగీత నాట్య వేదికపై ఆదివారం నృసింహ కూచిపూడి నాట్య భారతి నిర్వహణలో సుప్రజ నాయని శిష్య బృందం కూచిపూడి నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. వాగ్గేయకారులు అన్నమయ్య దీక్షితార్ తదితరులు కీర్తనలు నృత్య రూపంలో చూడముచ్చటగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాలల సాహిత్య రచయిత చొక్కాపు రమణ మాట్లాడుతూ.. గురువు ప్రతిభ శిష్యుల ప్రదర్శన వల్ల తెలుస్తుందన్నారు. సుప్రజ శ్రీనివాస్‌లు ఉత్తమ నాట్య గురువులని ఆయన అభినందించారు.



శాస్త్రీయ విద్యా విధానం అమలుకు పోరాడాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మతం, దేవుడు దోపిడీలో భాగమేనని ప్రొఫెసర్ కాశీం అన్నారు. సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. అనంతరం కాశీం మాట్లాడుతూ... ప్రజలు మతం, దేవుడు మత్తులో ఊగుతూ ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. బొడ్రాయి పండగ లాంటి వాటికి ప్రజలు లక్షలాది రూపాయలు అప్పుచేస్తూ వేడుకలు చేసుకుంటున్నారని అన్నారు. ఇది వారిని ఆర్థికంగా కుంగదీస్తోందని అన్నారు. నమ్మకం పేరుతో ప్రజలు ఆర్థికంగా నష్టపోవడం బాధాకరమని అన్నారు. ఈ డబ్బంతా చివరికి పెట్టుబడి దారుల చేతుల్లోకే వెళ్తుందన్నారు. శాస్త్రీయ విద్యా విధానం అమలు కోసం పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సాంస్కృతిక పోరాటం లేకుండా వర్గ పోరాటం విజయవంతం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గేయ రచయిత జయరాజు, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు వేదాంత్ మౌర్యా, మాజీ అధ్యక్షుడు ద్రావిడ ఉదయ్, కార్యదర్శి మోహన్, జాతీయ సమన్వయ కర్త రవి, ఉప్పులేటి నరేష్, గొర్రె శ్రీనివాస్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



సైంటిఫిక్ ఫెడరేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

స్కిల్ సెంటర్స్ ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో స్కిల్ సెంటర్స్ ఏర్పాటు కోసం నిరుద్యోగ యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ అడపా వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ, జిల్లా, మండ స్థాయిలో సెంటర్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్కిల్ సెంటర్స్ ద్వారా వెబ్ డిజైనింగ్, సాఫ్ట్‌వేర్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, ఎథికల్ హ్యాకింగ్, పైథాన్, బ్లాక్ చెయిన్, తదితర 100కు పైగా కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆహార నియమాలు పాటిస్తే వ్యాధులు అరికట్టొచ్చు

చిక్కడపల్లి: ప్రతి రోజు క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తూ ఆహార నియమాలు పాటిస్తే వ్యాధులను అరికట్టవచ్చని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు, డయాబెటిక్ చైర్మన్ జీకే రమణ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీసాయి డయాగ్నోస్టిక్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన స్థానికులకు మధుమేహ, కొలెస్ట్రల్, బీపీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. మధుమోహం ఉన్న వారు ప్రాణాయామ చేయాలని సూచించారు. వైద్యుల సలహాలు, సూచనలు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ సిబ్బంది సతీష్, సాయిరితీష్, వంశీ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి విధిగా వెళ్లి శాస్త్రీయ పద్ధతితో కులగణన సర్వే చేసే విధంగా ప్రభుత్వం తగు ఆదేశాలు జారీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. అర్థం పర్థం లేని కాలమ్స్, 67 ప్రశ్నలతో ప్రజలను అయోమయానికి గురి చేయకుండా, సామాజిక వర్గం (కులం) తెలుసుకునేందుకు రెండు మూడు కాలమ్స్‌తో సర్వేను సమగ్రంగా జరిపించాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ వద్దకు అఖిల పక్షాన్ని తీసుకెళ్లాలన్నారు. ఓబీసీ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేసే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే.. వెనుకబడిన తరగతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధ్యయనం పూర్తికాకముందే అసెంబ్లీలో బిల్లుపెడితే శాస్త్రీయత లోపిస్తుందన్నారు. అన్ని రకాలుగా ఆలోచన చేశాకే బీసీల రిజర్వేషన్లపై ప్రభుత్వం ముందుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు.

అభ్యుదయ సంఘాలన్నీ కలిసి పనిచేయాలి

జన విజ్ఞాన వేదిక జాతీయ కమిటీ వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పిల్లలకు మేలు చేయాలనుకునే అభ్యుదయ సంఘాలన్నీ కలిసి పనిచేయాలని జన విజ్ఞాన వేదిక జాతీయ కమిటీ వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జన విజ్ఞాన వేదిక జాతీయ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ... విద్యారంగం, రాజ్యాంగం, ప్రజారోగ్యం, యువత, మహిళలను చైతన్యం చేయడం, శాస్త్రీయ దృక్పథం తదితర అంశాలపై పోరాటం చేసే అభ్యుదయ సంఘాలన్నీ ఎలాంటి అభిప్రాయ బేధాలు ఉన్నా వాటిపై చర్చించుకుని కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. మిత్ర సంస్థల మధ్య విభేదాలు వస్తే విడిగా కూర్చొని మాట్లాడుకోవాలన్నారు. అంతే కానీ వాటిని బహిర్గతం చేసి రచ్చ చేయకూడదని సూచించారు. భిన్నమైన అభిప్రాయాలు ఉంటే చర్చించుకోవాలే తప్పా అలాంటి అభిప్రాయాలు ఉన్న వ్యక్తులను తొలగించాలనే ఆలోచనలను మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ కమిటీ అధ్యక్షురాలు స్వరాజ్య లక్ష్మి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణాజీ, విజ్ఞాన దర్శిని కన్వీనర్ టి.రమేష్, కుల నిర్మూలన సంఘం అధ్యక్షుడు వహీద్, కేవీపీఎస్ కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో దళిత బహుజనులను గెలిపించండి

కాచిగూడ: కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి దళిత బహుజన పార్టీ(డీబీపీ) అభ్యర్థులుగా పోటీ చేస్తున్న గవ్వల శ్రీకాంత్, గవ్వల లక్ష్మిని గెలిపించాలని డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించడానికి హైదరాబాద్ నుంచి ఉత్తర తెలంగాణ జిల్లలకు తరలి వెళ్తున్నామని తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేశాయని ఆరోపించారు. వర్గీకరణ చేపట్టి మాలలు, నేతకాని భవిష్యత్‌ను దెబ్బతీసిన కాంగ్రెస్, బీజేపీ పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థులను ఈ ఎన్నికల్లో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.

‘ప్రజా హక్కుల న్యాయవాది గొర్రెపాటి మాధవరావు’

- రిటైర్డ్ జిల్లా జడ్జి కోట్ల సుదర్శన్
- సంస్మరణ సభలో పుస్తకావిష్కరణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: న్యాయ వ్యవస్థలో కొత్త కోణాన్ని ఆవిష్కరించిన గొప్ప న్యాయవాది గొర్రెపాటి మాధవరావు అని రిటైర్డ్ జిల్లా జడ్జి కోట్ల సుదర్శన్ అన్నారు. విలువల కోసం జీవితాంతం ప్రజల పక్షాన పోరాడిన గొప్ప న్యాయవాది మాధవరావు అని కొనియాడారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం న్యాయవాది గొర్రెపాటి మాధవరావు సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక ముద్రించిన ‘ప్రజా హక్కుల న్యాయవాది గొర్రెపాటి మాధవరావు’అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

లాకప్ డెత్, బూటకపు ఎన్‌కౌంటర్లపై గళమెత్తారు..

◆ ఈ సందర్భంగా కోట్ల సుదర్శన్ మాట్లాడుతూ.. ఆయన చేసిన న్యాయ పోరాటాలు ప్రజల హృదయాలలో స్థిరస్థాయిగా ఉంటాయని అన్నారు. లాకప్ డెత్, బూటకపు ఎన్‌కౌంటర్లు జరిగినప్పుడు బాధితుల పక్షాన పోరాడారని తెలిపారు. వారికి నష్టపరిహారం చెల్లించే విషయంలో హైకోర్టు వరకు వెళ్లాల్సిన అవసరం లేదని జిల్లా, స్థానిక కోర్టుల్లోనే నష్టపరిహారం పొందొచ్చని వాదించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఇలా నష్టపరిహారం కింది కోర్టులో పొందవచ్చని గొర్రెపాటి మాధవరావు ద్వారానే తెలిసిందన్నారు.

ఫీజులు తీసుకోకుండానే పేదల పక్షాన పోరాడారు..

◆ ఈ విషయంపై చాలా మందికి అవగాహన లేదని హైకోర్టుకు వెళ్లి కోర్టు ఫీజులు చెల్లించలేని పేదవారికి ఆ తర్వాత ఇది ఎంతో సౌకర్యంగా మారిందన్నారు. మాధవరావు ఫీజులు తీసుకోకుండానే పేదల పక్షాన పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. మానవ హక్కుల కోసం అంకితభావంతో కృషి చేసిన వ్యక్తుల్లో మాధవరావు ఒకరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది నందిగామ్ కృష్ణారావు, మానవ హక్కుల వేదిక నాయకులు ఎ.చంద్రశేఖర్, తెలంగాణ అధ్యక్షుడు ఎ.భుజంగరావు, న్యూడెమోక్రసీ నాయకులు కె.గోవర్ధన్, సామాజిక కార్యకర్త కన్నెగంటి రవి, మాధవరావు సోదరుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజా హక్కుల న్యాయవాది గొర్రెపాటి మాధవరావు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ జిల్లా జడ్జి కోట్ల సుదర్శన్